# తెలుగు నాటకరంగ పునరుజ్జీవన దిశలో జరిగిన మంచి ప్రయత్నం "రాజా ఈడిపస్" ప్రదర్శన

**- అనిల్ ఎక్బోటే**

సాయంకాలం పదినిమిషాలు తక్కువగా ఆరుగంటలు. తొందరగా కోఠీ విమెన్స్ కళాశాల ఆవరణలోకి వెడుతున్నా నేను, మిత్రుడు సిద్ధార్థ. "నువ్వెప్పుడూ లేటే! ఈ డిపార్ట్‌మెంట్‌వాళ్లు సరిగ్గా టైమ్‌కు నాటకం మొదలుపెడతారట!" అన్నాడు సిద్ధార్థ దెప్పుతూ. "తెలుగు నాటకమా మజాకా! నాకు చెబుతున్నావ్! నువ్వే చూస్తావుగా!" అన్నాను. అయినా తొందరగానే వెళ్లాం. దర్బారుహాలు ముందు అప్పుడే కుర్చీలు నిండిపోయాయి. ముందు వరసంతా ఖాళీగా వున్నాయి. అక్కడ కూర్చుందామని వెళ్లాం. "సర్! ఇవి 'ఇన్‌వైటీస్'కి" అన్నాడు. "మీరు-?" "ఫలానా పత్రిక నుంచి" అని చెప్పాం. "అట్లాగా సర్! రండి" అని రెండోవరుసలో మధ్య సీట్లలో కూర్చున్న వాళ్ల స్టూడెంట్స్‌ని లేపి ఆ సీట్లు మాకిచ్చాడు. అతనికి థాంక్స్ చెబుతూ, "మరి ఆరుగంటలవుతోంది నాటకం మొదలుపెట్టడంలేదా?" అన్నాను. "మొదలుపెడుతున్నాం సర్!" అని హడావుడిగా వెళ్లిపోయాడు.

దూరంగా మెట్లమీద దేనికోసమో వెతుకుతూ చాట్ల శ్రీరాములుగారు కనిపించారు. ఆయన నాకు తెలుసు. నన్నుచూసి విష్ చేసి మెట్లమీద నుంచి దిగివచ్చాడు. "ఆలస్యం వుందా?" "లేదు సర్! నిన్నటి వర్షానికి, లైట్ పోల్స్ అన్నీ పడిపోయాయి. అన్నీ బాగుచేశాం. ఒక్కసారి లైటింగ్ చూసుకుని ప్రారంభిస్తాం." వెనక ఎత్తుగా లైటింగ్ పానెల్ వుంది. అక్కడనుంచే 1, 3, 12 అనీ, 8, 6, 3 అనీ ఎవరో అరుస్తున్నారు. ఆ లైట్లు ఆ స్పాట్‌లో పడుతున్నాయి. ఆయనెవరో ఓ.కె. అన్నాడు. ఆయనే వి. రామమూర్తి గారనుకుంటాను. మొన్న మాన్వీ యింట్లో కలిశాం. బెంగుళూరు రామమూర్తిగారు ఈయనేనా? అంటూవుండగా మ్యూజిక్ మొదలైంది. అంతా నిశ్శబ్దం.... 2 నిమిషాలు కాగానే మ్యూజిక్ క్రమంగా ఫేడ్‌అవుట్ అయింది. అవతల ఓ గంభీరమైన కంఠం మైక్‌లో "ప్రేక్షక మహాశయులకు స్వాగతం... ఈ అయిదు నిమిషాల ఆలస్యానికి క్షమించాలి. మరో రెండు నిమిషాలలో నాటకం ప్రారంభమౌతుంది." మళ్లీ ఒక నిముషం సంగీతం కొనసాగింపు.... ఫేడ్‌అవుట్.... నిశ్శబ్దం..... అందరూ మెడలెత్తి దర్బారుహాలు మెట్లవంక చూస్తున్నారు. నేను చాట్లగారి కోసం చూస్తున్నాను. ఆ మసక వెలుతురులో అక్కడవున్న ఎత్తుదిమ్మల చాటున మాయమయినట్లనిపించింది. అందులో ఒక ఆకారం చాట్లదేమోననిపించింది.

ఇంతలోనే మా కుడివైపున ఉన్న చెట్ల గుబురుల్లోంచి ఏదో అరుపులు. మసక వెలుతురులో దివిటీలు, కొవ్వొత్తులు, కొమ్మలూ పట్టుకున్న 20మంది దాకా జనం. విషాద సంగీతం. బహుశః గ్రీకుల సంగీతమేనేమో! దానితోపాటు "రక్షించండి ప్రభూ! రక్షించండి", "మీరే కాపాడాలి" అనే ఆర్తనాదాలు.... ఆ గుంపు రంగస్థలం ముందుభాగాన ఉన్న ఒక గుడిలాగా కనిపించే చోటికి వచ్చి అక్కడ ఆగి అక్కడ ప్రార్థనలు చేసి, వెనుదిరిగి "ప్రభూ! కాపాడండి" అంటూ ఐక్యంగా అరిచారు.

లోపలనుంచి ఒక్క ఉదుటున ఆ ప్రభువు వచ్చాడు, "ఓ నా థీబ్స్ ప్రజలారా!" అంటూ. చాలా గంభీరంగా వుంది గొంతు. "ఇతనే విద్యాసాగర్. నిన్ననే నాటకం ప్రాక్టీసు చేశాడు" అన్నాడు సిద్ధార్థ. "అదేమిటి? ఈ

బ్రోచర్‌లో 'యన్. కుటుంబరావు' అని వుందిగా. "కాని అతను రెండురోజుల క్రితం హార్ట్‌ఎటాక్‌తో ఆసుపత్రిలో చేరాడు. ఆయనకు బదులు వచ్చాడితను" అంటూ ఊదాడు నా మిత్రుడు. "ఇవన్నీ నీకెలా తెలుసు." "ఇందులో పనిచేసేవారు ముగ్గురు నలుగురు నాకు తెలుసు" అన్నాడు మెల్లగా.

"ఎందుకు వచ్చారు? ఏమిటి మీ బాధ" అని అడిగితే అక్కడ చేరినవాళ్లలో వృద్ధుడు, 'థీబ్స్ నగరం సంక్షోభాన్ని గురించి చెప్పి, 'దాన్ని మీరే నివారించాలి ప్రభూ!' అన్నాడు. "నాకూ అదే బాధ.... దీనికి కారణం కనుక్కొని రమ్మని మహారాణి సోదరుడు క్రియాన్‌ను అపోలో దేవాలయానికి పంపాను. ఇప్పటికే రావలసింది..." అనగానే జనం "అడుగో క్రియాన్..." అన్నారు. క్రియాన్ చెప్పిన మాటల సారాంశం – క్రిందటి రాజైన లయస్‌ను చంపినవాడు థీబ్స్‌లోనే వున్నాడు. వాడిని దేశం నుంచి బహిష్కరించడమో... లేదా రక్తానికి రక్తం బలితీసుకోవడమో నంటాడు. ఆ హంతకుడిని కనుక్కోవడం ఎలానంటాడు ఈడిపస్. ఆరా తీస్తాడు. ఒక దొంగల గుంపు చంపిందని చెబుతారు ప్రజలు. కనుక్కుని తీరుతానని వెళ్లిపోతాడు. ఆయన వెనుక క్రియాన్ వెడతాడు.

"ఆ వెనుకవెళ్లే అతనే భరణి... తనికెళ్ల భరణి... నాటకాలు వేస్తాడే... సినిమాలకి ఛాన్సు రావచ్చునట!" అంటూంది మా ముందు కూర్చున్న 16 ఏళ్ల అమ్మాయి వాళ్ల అమ్మతో.

ఇంతలో బృందగాయకులు వస్తారు. అందరు దేవుళ్లని ప్రార్థిస్తారు. ఆ లయస్ హంతకుడెవరో తెలుపమని. వీళ్ల ప్రార్థనలు విన్న ఈడిపస్ రాజప్రాసాదం నుంచి వెలుపలకు వచ్చి, 'మీ అభ్యర్థనలను విన్నాను... థీబ్స్ నగర పాలకుడుగా ప్రజలనందరినీ హెచ్చరిస్తున్నాను. ఆ హంతకుడెవరో తెలిస్తే నిర్భయంగా చెప్పండి.... లేకుంటే సంఘ బహిష్కరణ తప్పదు – అంటాడు. దేశబహిష్కారమే అటువంటివాడికి శిక్ష' అంటాడు.

బృందగాన నాయకుడు 'అపోలో భగవానుడికీ, అక్కడి దైవవాణికీ అతి సన్నిహితుడు టైరేషియస్. ఆయన ఏం సలహా చెబుతాడో వినండి' అంటాడు. 'ఆయన కోసం కబురుచేశాం... రావాలి' అంటూవుండగానే టైరేషియస్ వస్తాడు... గుడ్డివాడు... ముందు తనకేమీ తెలియదని, తానేమీ చెప్పలేనని దాటువేసే ప్రయత్నం చేస్తాడు. కాని కోపంతో ఈడిపస్ నీకు కూడా యీ హత్యలో భాగం వున్నదేమో నన్నప్పుడు తనకు తెలిసిన నిజాన్ని చెప్పేస్తాడు. 'నువ్వు ఎవరికోసం వెతుకుతున్నావో ఆ హంతకుడివి నువ్వే' అని ఎన్నో భయంకరమైన విషయాలు చెబుతాడు. 'అసలు నీకు నీ తల్లిదండ్రులెవరో తెలుసా? అది తెలియదు కనుకనే – చనిపోయిన వారికీ, బ్రతికివున్నవారికీ – చివరకు నీ రక్తమాంసాలకే నీవు శత్రువవుతున్నావు' అని తూలనాడతాడు.

ఈ సంఘర్షణను చాలా సమర్థవంతంగా నడిపారు యిద్దరు నటులూ. ఈడిపస్ వేసిన విద్యాసాగర్, టైరేషియస్ వేసిన బి. నారాయణ – యిద్దరూ సమఉజ్జీలుగా నటించారు. ఈ రంగం పూర్తిఅయి టైరేషియస్ నిష్క్రమించే సమయంలో ప్రేక్షకుల నుంచి చప్పట్లు మారుమోగాయి.

ఈలోగా క్రియాన్ వచ్చాడు. టైరేషియస్‌తో కలిసి ఈడిపస్‌ను చంపడానికి తాను కుట్రపన్నాడని ఈడిపస్ అనడంతో ఆయన కోపంతో థీబ్స్ ప్రజలముందుకు వచ్చాడు. ఈడిపస్ కూడా వచ్చాడు. ఇద్దరూ ఒకరినొకరు దూషించుకున్నారు. ఈ మాటలు విన్న జొకాస్టా వచ్చి ఇద్దర్నీ వారిస్తుంది. క్రియాన్‌ను తన అంతఃపురానికి వెళ్లమని ఆజ్ఞాపిస్తుంది. ఈ పోట్లాటకు కారణం ఏమిటని అడుగుతుంది. లయస్ హత్యకు నేను కారణమని చెప్పమని ఒక కుహనా ప్రవక్తని పంపాడు. ఇటువంటి వాటికి భయపడకండి. ఇదివరకు లయస్ మహారాజుకు ఒక ప్రవక్త చెప్పాడు, నిన్ను నీ కుమారుడే చంపుతాడని. అప్పుడు లయస్ ఆ కుర్రవాడి పాదాలకు మేకులు కొట్టించి కొండలమధ్య వదిలిపెట్టించాడు. ఇక ప్రవక్త చెప్పింది నమ్మడం ఎలా?' అంటుంది జొకాస్టా.

మరొక్క సంగతి కూడా అడిగాడు ఈడిపస్. దొంగలగుంపు లయన్‌ని ఎక్కడ చంపిందని. "మూడుదారుల కూడలిలో" అంటుంది జొకాస్టా. "అప్పుడాయనతో ఎంతమంది మనుషులున్నారు?" అని అడిగాడు ఈడిపస్. "అయిదుగురు జనం. అందులో ఒకడు పశువులకాపరి. అతడే బతికి బయటపడి మాకీ విషయాలు చెప్పాడు" అంటుంది జొకాస్టా.

హతాశుడైనాడు ఈడిపస్. "భగవాన్! నన్ను ఎటువైపు నడిపిస్తున్నావ్?" అంటూ బిగ్గరగా అరచి, "ఆ పశువుల కాపరి ఎక్కడ? అతనికి వెంటనే కబురుచెయ్యండి" అంటూ అతిత్వరగా తన అంతఃపురానికి వెళ్లిపోతాడు. జొకాస్టా నిర్ఘాంతపోయి నిలుచుండిపోయింది.

జొకాస్టా వేసిన అమ్మాయి ఉషాజయంతి. ఆమెకూడా రెండో సంవత్సరం చదువుతున్నదట! ఆమె నటనే ఉన్నవారిలో కొంచెం బలహీనమైనదనిపించింది. ఆమె స్వరం యింకా గట్టిగా వుంటే యీ అతిప్రధానమైన రంగం యింకా రక్తికట్టి వుండేది. అయితే విద్యానాటకరంగంలో యిటువంటి ఒడుదుడుకులు తప్పవు. కాని ప్రేక్షకులు అలా అనుకోరు కదా!

మళ్లీ బృందగానం. తర్కవితర్కాలు. ఏం జరుగుతుందోని ఆందోళన. ఇంతలో ఒక వార్తాహరుడు వచ్చి బృందగానం వాళ్లతో తన ఎరిక చెప్పుకొని, 'ఈడిపస్ మహారాజు ఎక్కడవున్నాడు? ఆయనకో మంచివార్త తెచ్చా' నంటాడు. ఈ పాత్ర ధరించింది పద్మనాభస్వామి అని కరపత్రంలో రాసివుంది. చాలా చలాకీగా, ప్రతి మాటా హాస్యస్ఫోరకంగా చెప్పాడు. నాటకానికి పెద్ద రిలీఫ్. కాని ఆ రంగం అయ్యేసరికి ఆ రంగమే సంఘర్షణను ఎక్కువ చేసిందనిపించింది. జొకాస్టా "ఎవరు నువ్వు? ఏమిటా వార్త?" అంటుంది. "అమ్మా! నేను కొరింత్ నుంచి వస్తున్నా. మా రాజు పోలిబస్ చనిపోయాడు – నువ్వు ఆయనను చంపుతావని ఎవరో పకీరు చెబితేకదూ యిల్లువదిలి దేశాలు పట్టి పోయావ్? ఇప్పుడు మిమ్మల్ని కొరింత్‌కు రాజును చేస్తాడంట!" అని చెబుతాడు. తాను కోరింత్‌కు రాలేనని, తన తండ్రిని చంపి తల్లిని వివాహమాడతానని అపోలో వారికి చెప్పిందని – అంటాడు ఈడిపస్. "ఓస్! అంతేనా? ఆ పోలిబస్ నీకేమీ కాడు. ఆ తల్లి నీ తల్లీ కాదు. నువ్వు చిన్నపిల్లాడిగా వున్నప్పుడు ఎవరో నీ కాలికి మేకులు కొట్టి నిన్ను సితరాన్ కొండల్లో వదిలి వచ్చారు. నేనేగదూ నిన్ను చూసి పోలిబస్ దొరకు నిన్ను అప్పగించింది." "నీకెట్లా దొరికాను?" అని అడిగాడు ఈడిపస్. "సితరాన్ కొండల్లో పశువుల్ని కాసే ఒక కాపరి – లయన్ గారి దగ్గర వుండి రాజుగారి గొర్రెలు కాచేవాడు. ఆయన యిచ్చాడు నిన్ను" అని తనకు తెలిసిన విషయాలు చెబుతాడు. బృందగాయకులు యిదివరకు జూకాస్టా కబురుచేసిన పశువుల కాపరి యితనేనని చెబుతారు. ఆ గొర్రెలకాపరిని వెంటనే పిలిపించమని చెబుతాడు.

కాని జొకాస్టాకు విషయం అర్థమయింది. ఈడిపస్ తన కొడుకేనని గ్రహించింది. ఇక పశువుల కాపరి విషయం మరచిపొమ్మంటుంది. నిజం తెలుసుకునితీరాలంటాడు ఈడిపస్. జొకాస్టా పరుగుపరుగున తన గదిలోకి వెళ్లిపోతుంది. ఇంతలో పశువుల కాపరి వచ్చాడు... ముసలాడు. భయపెట్టగా భయపెట్టగా థీబ్స్ రాజుగారి అంతఃపురంలో నుంచి ఆ పిల్లవాడిని చంపమని తనకిచ్చారని, చంపబుద్ధికాలేదని, మరోదేశం వెళ్లి బతికితే ఈ శాపం నిజం కాదనుకున్నాను. నువ్వే ఆ బాబువయితే నీకన్నా దురదృష్టవంతుడు లేడు" అంటూ వార్తహరుడు, గొర్రెలకాపరి వెళ్లిపోయారు. "నేను శాపగ్రస్తుడిని" అంటూ ఏడుస్తూ ఈడిపస్ వెడతాడు.

బృందగానం విధి చిద్విలాసాలమీద వ్యాఖ్యానం చేస్తుంది. అంతఃపురం లోపలినుంచి ఒక వార్తాహరుడు వచ్చి అక్కడ జరిగిన సంగతులు థీబ్స్ ప్రజలకు వివరిస్తాడు. "జొకాస్టా రాణి ఆత్మహత్య చేసుకుంది. ఈ

భయంకరమైన నిజం తెలిసి ఈడిపస్ తన కళ్లను తానే పొడుచుకొని గుడ్డివాడైనాడు." అంతఃపురం తలుపులు తెరుచుకున్నాయి. ఈడిపస్ గుడ్డివాడై బయటకు వచ్చాడు.

ఇక్కడనించి మరో పదినిముషాలు ఈడిపస్ ఆక్రందనలు. తన జీవితాన్ని తలుచుకొని కుమిలిపోవడం. ఈ రంగంలో విద్యాసాగర్ చాలా గొప్పగా నటించాడు. ఆ క్షణంలో భారతదేశంలో ఉండే ఏ గొప్ప నటుడికి యితడు తక్కువకాదు – అనిపించింది. క్రియాన్ వస్తాడు. తన పిల్లలు జాగ్రత్త అంటాడు. వాళ్లని పిలిపిస్తాడు క్రియాన్. వాళ్లదగ్గర కడసారి వీడ్కోలు చాలా హృదయవిదారకమైన సన్నివేశం.

చివరకు బృందగానం. "ఆనందం ఎండమావి, సంతోషం శాపం, ఏ మనిషీ ఆనందమయుడు కాదు, జీవితం చివరిక్షణం దాకా, తుది నిష్క్రమణం దాకా' అనే సందేశంతో నాటకం ముగుస్తుంది.

నిజానికి యిదో డిటెక్టివ్ నాటకంలా ప్రతిక్షణం ఎంతో ఆతురతతో గడిచింది. ప్రతినిత్యమూ నాటకాలను చూడడమే ఉద్యోగంగా ఉన్న మావంటి వాళ్లకే యీ నాటకం కొత్తగా, కొంగ్రొత్త దృశ్యకావ్యాల విలువలతో ఆశాజనకంగా అనిపించింది. ప్రతి నటుడూ తన బాధ్యతను మంచి శిష్యుడుగా, మంచి నటుడుగా నెరవేర్చాడని చెప్పవచ్చు.

దర్శకులు శర్మగారు ఎన్నుకున్న నేపథ్యం నాటకానికి ఎంతో నిండుతనాన్ని, కొత్త అర్థాన్ని స్ఫురింపచేసింది. నేపథ్య సంగీతాన్ని ఎన్నుకోవడంలోను, దానిని సరైనవిధంగా ప్రసారం చెయ్యడంలో కూడా ఆయన తన ప్రతిభను కనబరచారు. నటులు – ముఖ్యంగా విద్యాసాగర్, భరణి, బి. నారాయణ, పద్మనాభస్వామి, బృందగాన నాయకుడు ఆకెళ్ల సత్యనారాయణమూర్తి – యిదివరకే పేరున్న నటులు. ఈ నాటకంలో వారి అనుభవం ఎంతో కనిపించింది. ఇన్ని పార్శ్వాలను సమన్వయం చేసుకుంటూ, ఒక పాశ్చాత్య నాటకాన్ని – మన నమ్మకాలకు విరుద్ధంగా ఉన్న నాటకాన్ని – మన మనసులకు హత్తేలా ప్రదర్శించిన నాగభూషణశర్మగారు అభినందనీయులు. ఈ నాటకాన్ని చూస్తే తెలుగు నాటకానికి మంచిరోజులు వచ్చాయనిపిస్తున్నది.

*(1985 మార్చి 25, 26, 27 తేదీలలో హైదరాబాద్ కోఠీలోని యూనివర్సిటీ విమెన్స్ కాలేజీ దర్బారుహాలు ముందుభాగంలో గ్రీకు నాటక నేపథ్యాన్ని తలపించే సహజ పరిసర రంగస్థలంమీద జరిగిన 'రాజా ఈడిపస్' ప్రదర్శన నాటకాభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని రేపింది. మార్చి 28వ తేదీ 'న్యూస్‌టైమ్' పత్రికలో అనిల్ ఎక్బోటే రాసిన సమీక్షా వ్యాసానికి యిది తెలుగు అనువాదం).*